సాక్షి
అనంతపురం
బుధవారం ॥ 4 ॥ జూన్ ॥ 2025



చీనీ టన్ను రూ.33,300
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,300 పలికాయి.



సేవ మాటున దోపిడీ
ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సేవ పేరుతో ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకులు దందాకు తెరలేపారు. సిటీ స్కాన్ ఫిల్మ్‌ల పేరుతో రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు. 8లో



జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎవరికెంత ముట్టింది..?

- పుట్టపర్తి ప్రవాస భారతీయుడికి చీటింగ్ కేసులో పోలీసులపైనా విచారణ!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రవాస భారతీయుడిని మోసం చేసిన కేసులో నిందితుడి నుంచి భారీగా లబ్ధి పొందిన పోలీసులపైనా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. తనకు రూ.12 కోట్లకు పైగా మోసం చేశారని మే 22న ప్రవాస భారతీయుడు మహేంద్రకర్ అర్విన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపై పుట్టపర్తి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఎఫ్ఐఆర్ అనంతరం నిందితుడిని అరెస్టు చూప కుండా కొంతమంది టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు అతని ఆస్తులను బదలాయించడం, మరికొన్ని ఆస్తులపై అగ్రిమెంట్లు చేయడం జరిగింది. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో టీడీపీ నాయకులతో పుట్టపర్తి పోలీసులు రూ.50 లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్టు సమాచారం. ఈ బాగోతమంతా ఒక సబ్ డివిజనల్ పోలీసు అధికారి, కొంతమంది పోలీసుల సమక్షంలోనే జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిత్యం సత్యసాయి భక్తులతో కళకళలాడే పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి కూతవేటు దూరంలోనే ఇదంతా జరగడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో పోలీసు అధికారులు విచారణను వేగవంతం చేశారు. రాయ'బేరం'లో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారికి టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డి అండదండలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈయన ఏరికోరి సదరు అధికారిని పుట్టపర్తికి తెచ్చుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా డీల్ కుదుర్చుకున్న రూ.50 లక్షల్లో ఉన్నతాధికారులకు ఏమైనా వెళ్లిందా అన్న కోణంలోనూ విచారణ చేస్తున్నట్టు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని విజయవాడకు చెందిన ఓ పోలీసు అధికారి చెప్పారు.

రైతును మింగిన అప్పులు


గొల్ల గోవిందప్ప(ఫైల్)

శెట్టూరు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని యాటకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాంభూపాల్ తెలిపిన మేరకు... యాటకల్లు గ్రామానికి చెందిన గొల్ల గోవిందప్ప (74) తన మూడెకరాల పొలంలో 8 బోర్లు వేశాడు. చివరి బోరులో నీళ్లు పడ్డాయి. అప్పటికే రూ. 5 లక్షల వరకూ అప్పులయ్యాయి. నీళ్లు పడ్డాయని, పంటలు పెట్టి అప్పులు తీర్చవచ్చనే ఉద్దేశంతో మళ్లీ రూ. లక్ష వరకూ అప్పు చేసి టమాట, వేరుశనగ సాగు చేయగా.. నష్టాలు వచ్చాయి. దీంతో గోవిందప్ప నైరాశ్యంలో కూరుకుపోయాడు. అప్పులెలా తీర్చాలో అంటూ నిత్యం మదనపడుతుండేవాడు. సోమవారం రాత్రి కూడా ఇంట్లో కుటుంబ సభ్యులతో అప్పుల విషయం చర్చించి బాధపడ్డాడు. అయితే, కుటుంబ సభ్యులు గోవిందప్పకు ధైర్యం చెప్పి పడుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం లేచి చూసే సరికి గోవిందప్ప కనపడకపోవడంతో కుటుంబీకులు ఆందోళనతో అంతా వెతికారు. ఇంటి సమీపంలోని పాడుబడ్డ పెంకుల కొట్టంలో దూలానికి వేలాడుతూ కనిపించిన గోవిందప్పను చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు గోవిందప్పకు భార్య గొల్ల మల్లమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఉద్యోగుల ప్రవర్తన బాగుండాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: 'విధి నిర్వహణలో ఉద్యోగుల ప్రవర్తన బాగుండాలి. ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పింఛను పంపిణీలో ఫీడ్‌బ్యాక్‌పై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీపీఓ నాగరాజు నాయుడుతో కలిసి సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ముఖ్యంగా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పింఛను లబ్ధిదారుల నుంచి డబ్బు తీసుకోకూడదన్నారు. సిబ్బంది కనిపిస్తేనే లబ్ధిదారులు నమస్కారం చేసేలా ప్రవర్తన ఉండాలని సూచించారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీని తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, డీపీఓ, డీఆర్‌డీఏ పీడీపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని హితవు పలికారు.

వెన్నుపోటుకు ఏడాది

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల డప్పు కొట్టి.. అధికారంలోకి వచ్చాక సామాన్యులు, పేదల పొట్టకొట్టిన కూటమి సర్కారు వెన్నుపోటుకు నేటితో ఏడాది పూర్తయింది. సరిగ్గా 2024 జూన్ 4వ తేదీన 'కూటమి'కి అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. 'మా హామీలు మీ జీవితాలనే మార్చేస్తాయం'టూ ఎన్నికల ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల్లో లేని ఆశలు కల్పించిన చంద్రబాబు, ఆయన పార్టీ పరివారం.. గద్దెనెక్కాక మాత్రం ముఖం చాటేశారు.



- అలవిగాని హామీలతో లక్షలాది మందికి కుచ్చుటోపీ
- ఎన్నికల ముందు ఊరూరా 'సూపర్‌సిక్స్' ప్రచారం
- అధికారంలోకి వచ్చాక ఒక్క పథకమూ అమలు చేయని వైనం
- పైగా కబ్జాలు, ఆక్రమణలు, మోసాలు, దోపిడీలతో భయభ్రాంతులు
- 'కూటమి' పాలనను ఎండగడుతూ నేడు వైఎస్సార్ సీపీ నిరసన ర్యాలీ

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో వివిధ పథకాల లబ్ధిదారులు ఇలా

పథకం	లబ్ధిదారుల సంఖ్య
వైఎస్సార్ రైతు భరోసా	2,98,535
సున్నా వడ్డీ పంటరుణాలు	1,43,399
వైఎస్సార్ ఉచిత పంటబీమా	2,32,581
ఇన్‌పుట్ సబ్సిడీ	72,693
జగనన్న తోడు	27,864
వైఎస్సార్ ఆసరా	24,113
వైఎస్సార్ సున్నా వడ్డీ	32,441
ఎస్‌హెచ్‌జీ బ్యాంకులింకేజీ	27,377
జగనన్న అమ్మఒడి	2,40,096
వైఎస్సార్ నేతన్న నేస్తం	10,525
జగనన్న విద్యాదీవెన	50,702
వాహన మిత్ర	8,806

గమనిక: చంద్రబాబు ప్రభుత్వంలో వీరిలో ఒక్కరికీ రూపాయి లబ్ధి చేకూరలేదు..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందలేదు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని మోసగించారు. 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని నేడు ఆ విషయమే పట్టించుకోవడం లేదు. సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఉచిత బస్సుకు ముహూర్తమే ఖరారు కాలేదు. 'ఇంటింటికీ ఉద్యోగమిస్తాం.. ఉద్యోగం ఇవ్వకపోతే నెలకు రూ.3 వేలు భృతి' అన్నా నేటికీ అతీగతీ లేకుండా పోయింది. ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఇస్తామని ఇప్పటివరకూ పైసా ఇవ్వలేదు.

సామాన్యుల బెంబేలు..

అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు నెరవేర్చకపోగా ఎమ్మెల్యేలు, పోలీసులు, టీడీపీ కార్యకర్తలు, సామాన్యులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. కబ్జాలు, ఆక్రమణలు, దందాలు, అక్రమ వసూళ్లకు అంతులేకపోవడంతో జనం బెంబేలెత్తుతున్నారు.

- కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములతో ఉమ్మడి అనంత జిల్లాను మత్తులో జోగేలా చేశారు.
- హిందూపురంలో బాలకృష్ణ పీఏల అండ చూసుకుని ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.
- ఫ్యాక్షన్ హత్యలు మళ్లీ పురుడుపోసుకున్నాయి. రామగిరి మండలంలో కురుబ లింగమయ్యను పచ్చ మూకలు కొట్టి చంపాయి. రాప్తాడులో నారాయణరెడ్డి, ముత్యాలమ్మను టీడీపీ నేతలు నరికి చంపారు.
- ఉమ్మడి జిల్లాలో కొండలు, గుట్టల్ని 'తమ్ముళ్లు' పిండిచేసి సహజ వనరులను లూటీ చేస్తున్నారు.
- చిత్రావతి, పెన్నా, వేదవతి హగరి నదుల్లో అక్రమంగా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు.
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారు.
- అనంతపురం అర్బన్‌లో ఎవరైనా ఇళ్లు కట్టాలంటే ఎమ్మెల్యేకు ట్యాక్స్ కట్టాల్సిన పరిస్థితి.
- మట్కా, గంజాయికి తాడిపత్రి నియోజకవర్గం అడ్డాగా మారిపోయింది.
- గుత్తిలో ఓ వ్యక్తిని టీడీపీ నేతలు రైలు పట్టాలపై పడుకోబెట్టి డబ్బు దండుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.
- రాప్తాడులో వెంచర్లు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే డబ్బు ముట్టజెప్పాలని చెబుతుండటంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అటువైపు చూడటమే మానేశారు.

నేడు వెన్నుపోటు దినం..



హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు తీరును నిరసిస్తూ 'వెన్నుపోటు దినం' పేరుతో వైఎస్సార్ సీపీ ర్యాలీలకు శ్రీకారం చుట్టింది. బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కనున్నాయి.

ప్రభుత్వానికి కనువిప్పు కల్గిద్దాం



అనంతపురం కార్పొరేషన్: వెన్నుపోటు నిరసన ర్యాలీతో ప్రభుత్వానికి కనువిప్పు కల్గిద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై, కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకంతా చెన్నకేశవ స్వామి ఆలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లోనూ 'వెన్నుపోటు దినం' ర్యాలీలు ఉంటాయన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు, యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చారని 'అనంత' గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌తో పాటు 175 హామీలను ప్రకటించిన చంద్రబాబు.. ఇంత వరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబు కుట్రలను తిప్పికొడతామని, ప్రభుత్వ మెడలు వంచైనా ప్రజలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

ఈసారీ అప్పులు తప్పవేమో!



రబీ సీజన్ ముగిసి, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం నుంచి రైతులకు రూపాయి సాయం కూడా అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకూ రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని గత ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా నేటికీ ఆ వాగ్దానాన్ని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో పంటల పెట్టుబడి కోసం ఈ సారి కూడా అప్పులు తప్పేలా లేవు.

– చెన్నారెడ్డి, రైతు, జంబులదిన్నె, గార్లదిన్నె మండలం

మాట తప్పిన చంద్రబాబు



అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు పెద్ద పీట వేస్తామని, బడికి వెళ్లే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు వేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మాట తప్పారు. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలమవుతున్నా 'తల్లికి వందనం' అమలు చేయలేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన 'అమ్మ ఒడి' పథకాన్ని చంద్రబాబు 'తల్లికి వందనం'గా పేరు మార్చి ఓట్లను దండుకున్నారు. ఇదిగో.. అదిగో అంటూ ఎన్నికల వరకు నెట్టుకొచ్చే ధోరణిలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లుంది.

– పావని, పాలచెర్ల, రాప్తాడు మండలం

రూ.18 వేలు ఎప్పుడిస్తారు సార్?



హామీలిచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా .. కాదా అని ఆలోచన చేయాలి. సీఎం పీఠంపై కూర్చున్నాక ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుంది అంటే ఎలా నమ్మాలి. ఆడబిడ్డలకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పిన హామీని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి. సీఎం సార్ నాకు ఏడాదికి రూ.18 వేలు ఇవ్వాల్సి ఉంది. ఎప్పుడిస్తారో తెలియడం లేదు. ఎప్పటికప్పుడు ఉచిత బస్సు ప్రయాణం వాయిదా వేస్తున్నారు. జగనన్న సర్కార్‌లో మహిళలే మహారాణులు. అమ్మ ఒడి, సున్నా వడ్డీ ద్వారా రూ.కోట్ల లబ్ధి చేకూరింది. 'నాడు మహిళల చేతిలో డబ్బులు గల గల.. నేడు వెలవెల' అన్న చందంగా మారింది.

– మమత, ఎం.బండమీదపల్లి, రాప్తాడు మండలం

రిలీజ్ డేట్‌లు తప్ప ఏమీ లేదా బాబూ?

- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్


మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: 'సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో కేవలం రిలీజ్ డేట్‌లను ప్రకటిస్తున్నారు. ఆ తర్వాత ఉత్తచేతులు చూపుతున్నారు. కనీసం ఒక్క హామీని అమలు చేద్దామన్న చిత్తశుద్ధి చంద్రబాబులో కన్పించడం లేదు' అని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టేందుకు 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీలకు వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చిందన్నారు. శాంతియుతంగా అధికారులకు వినతి పత్రం సమర్పించి, కూటమి ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితిని తెలియజేయనున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో విశ్వసనీయత లోపించిందన్నారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు తదితర హామీలను అమలు చేయకపోగా, అమరావతి పేరుతో రూ.1,60,000 కోట్ల అప్పులు చేశారని దుయ్యబట్టారు. అభివృద్ధి అంటే కేవలం అమరావతి మాత్రమేనా అని ప్రశ్నించారు. వెనుకబడ్డ అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప ప్రాంతాలు కన్పించడం లేదా అని విమర్శించారు. హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని తగ్గించి భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేశారన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లా వాసులకు ఎంతో మేలు చేసేలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న గొప్ప నిర్ణయాన్ని చంద్రబాబు అటకెక్కించారన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఊసే లేకుండా పోయిందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. విశాఖలో స్టీల్ ఫ్యాక్టరీని తామే తీసుకొచ్చామని టీడీపీ చెబుతోందని, ఇంతకన్నా దుర్మార్గం మరొకటి ఉందా అని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగాతి విజయప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

'మహాత్మా.. అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించు'


గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: 'మహాత్మా... మా పోస్టులు మాకు కేటాయించేలా అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించు' అంటూ ఇంగ్లిష్ పదోన్నతుల టీచర్లు విన్నవించుకున్నారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మహాత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో ధర్నా చేశారు. 21 జీఓ ప్రకారం 19 మాత్రమే ఖాళీలున్నాయంటూ చెబుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పదోన్నతుల జాబితాలోని సీనియర్ ఎస్జీటీలు జి. సూర్యుడు, కోనంకి చంద్రశేఖర్, జయపాల్ నాయుడు, నరసింహులు, లింగమయ్య, మహమ్మద్ రఫి, అంజి నాయక్, గోపాల్ రెడ్డి, పీరు నాయక్, వన్నారెడ్డి పాల్గొన్నారు. ఎస్టీయూ రమణారెడ్డి, యూటీఎఫ్ గోవింద రాజులు, ఏపీటీఎఫ్-1938 శ్రీనివాసులు రెడ్డి, సత్యప్రసాద్, ఆప్టా శంకరమూర్తి మద్దతు తెలిపారు.

16 రోజులు... 209 కిలోమీటర్లు

- నేటి నుంచి తలారి రంగయ్య 'ఆర్డీటీ పరిరక్షణ మహా పాదయాత్ర'

కళ్యాణదుర్గం: ఉమ్మడి అనంతపురం జిల్లా జీవనాడి ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పురుడుపోసుకుంది. పేద ప్రజలను ఆదుకుంది. అలాంటి ఆర్డీటీకి ఇటీవల ఇబ్బందులు తలెత్తాయి. విదేశాల నుంచి సంస్థకు వచ్చే నిధులను ఆపేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న అనాలోచిత నిర్ణయం ఒక్కసారిగా పేదలను ఆందోళనలో పడేసింది. ఈ క్రమంలో ఆర్డీటీ పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య 'పాదయాత్ర'కు శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగనున్నారు.

16 రోజులు...209 కిలోమీటర్లు

బెళుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి తండా (గొంచితండా) నుంచి రంగయ్య పాదయాత్ర బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. మొత్తంగా 16 రోజుల పాటు 209 కిలోమీటర్ల మేర కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాల్లోని 63 గ్రామాల మీదుగా యాత్ర సాగుతుంది. పాదయాత్ర మొదటి రోజు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, శ్రేణులు పాల్గొని రంగయ్యకు సంఘీభావం తెలపనున్నారు.

ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించకపోతే 55 ఏళ్లుగా పేదలు పొందుతున్న అన్ని సేవలు, సౌకర్యాలు పూర్తిగా నిలిచిపోతాయి. పిల్లల చదువులు, ఇళ్లు, వైద్య సేవలు, మహిళా సంఘాల ప్రయోజనాలు, దివ్యాంగులు, రైతులు ఇలా అందరికీ తీరని నష్టం వాటిల్లుతుంది. ఆర్డీటీని కాపాడుకోవడానికి ప్రజలందరూ కలసికట్టుగా పోరాడాలి. సంస్థ ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ రుణం తీర్చుకునే అవకాశంలా భావించి కదలిరావాలి.

– డాక్టర్ తలారి రంగయ్య, మాజీ ఎంపీ

ఏదీ సమాచారం.. ఇదేం ఘోరం!

- బదిలీలకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు చెప్పని విద్యాశాఖ
- ఆందోళనలో ఉపాధ్యాయులు
- నేడు స్కూల్ అసిసెంట్ల బదిలీలకు వెబ్ ఆప్షన్లు
- ఖాళీలు చూపించలేదంటున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఏ చిన్న సమాచారం కూడా బయటకు చెప్పకుండా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పూర్తిగా గోప్యత పాటిస్తుండడంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది టీచర్లు బదిలీలు, పదోన్నతులకు దరఖాస్తు చేసుకున్నారు. రోజూ 3-4 సార్లు రాష్ట్ర అధికారులు వెబెక్స్‌లు పెట్టుకుంటూ వివిధ అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇవేవీ క్షేత్రస్థాయిలో ఉండే టీచర్లకు చేరడం లేదు. కనీసం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్న గ్రూపుల్లో షేర్ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పోనీ మీడియా ద్వారానైనా ఉపాధ్యాయులకు తెలియజేసే ప్రయత్నాలు చేయకపోవడంపై టీచర్లు మండిపడుతున్నారు. పొరుగు జిల్లాలకు సంబంధించి రోజూ స్వయంగా డీఈఓల పేరుతోనే వివిధ మెసేజ్‌లు టీచర్ల గ్రూపుల్లో వైరల్ అవుతున్నాయి తప్ప మన జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా సీనియార్టీ జాబితాలు, ఖాళీల విషయం ఏమాత్రం బయటకు చెప్పడం లేదు. రెండు రోజుల క్రితం పీఎస్‌హెచ్‌ఎంల బదిలీలయ్యాయి. ఆయా సబ్జెక్టుల్లో మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు పీఎస్‌హెచ్‌ఎంలుగా మంగళవారం బదిలీలు చేశారు. అయితే ఎంతమంది పీఎస్ హెచ్‌ఎంలుగా వెళ్లారు... ఏయే సబ్జెక్టుల వారు వెళ్లారు...వీరిలో తప్పనిసరి, రిక్వెస్ట్ బదిలీలు ఎవరు అనే సమాచారం రాత్రి 10 గంటలు దాటినా బయటకు చెప్పలేదు.

తుస్...మన్న కోఆర్డినేషన్ సమావేశం

బదిలీ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు నుంచే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ కార్యాలయం నుంచి ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. రెండోరోజు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓను అడ్డుకుని నిరసన తెలియజేశారు. డీఈఓ కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదని, ఇతర జిల్లాల అధికారులు గ్రూపుల్లో పెడుతున్న సమాచారానికి అనుగుణంగా ముందుకు వెళ్లే దౌర్భాగ్యం నెలకొందంటూ వాపోయారు. ఇకపై అలా జరగదని, మరుసటి రోజే ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేస్తామన్న డీఈఓ.. నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదని నాయకులు మండిపడుతున్నారు.


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఖాళీలు చూపించకుండానే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలట!

స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఖాళీలు ప్రదర్శించకుండానే బుధవారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని చెబుతున్నారంటూ టీచర్లు వాపోతున్నారు. సీనియార్టీ జాబితా, ఖాళీలు ప్రకటించిన తర్వాత అభ్యంతరాలకు గడువు ఇవ్వడం లేదంటున్నారు. గుత్తి కోట జెడ్పీహెచ్ఎస్‌లో గణితం టీచరు ఇటీవల హెచ్ఎం పదోన్నతిపై కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ పోస్టు ఖాళీ చూపించలేదు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లిష్ టీచరు జనవరిలో రిటైర్డ్ అయ్యారు. ఆ పోస్టు ఖాళీ చూపించలేదు. ఇక్కడ హిందీ ఒక పోస్టు ఖాళీగా ఉంటే రెండు పోస్టులున్నట్లు చూపించారు. బుధవారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలంటూ అధికారులు చెబుతున్నారు. ఉన్న ఖాళీలను చూపించకుండా, లేని ఖాళీలను చూపించిన స్కూళ్లు కోరుకుంటే జరిగే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ టీచర్లు వాపోతున్నారు.

టీచర్లను ఒత్తిడికి గురి చేస్తున్నారు: ఏపీటీఎఫ్

మంగళవారం సాయంత్రం పాఠశాల సహాయకుల సీనియార్టీ, వేకెన్సీ జాబితాలు విడుదల చేసి గ్రీవెన్స్‌కు ఒకరోజు సమయం ఇవ్వకుండా ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసి వెబ్ ఆప్షన్లు ఇవ్వమని వేధిస్తున్నారని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సీనియారిటీ, వేకెన్సీ జాబితాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి విద్యాశాఖ కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం బయటకు రాకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు గురు రాజ్, నాగేంద్ర, ఈశ్వరయ్య, భాగ్యరాజ్, దాసరి మురళి, ఓబులేసు, చిదంబరయ్య, వెంకటరామిరెడ్డి, చక్రి, రాజశేఖర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తాడిపత్రి టౌన్: స్థానిక రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీ సమీపంలో దుర్గమ్మ గుడి వద్ద నివాసముంటున్న ముల్లా నజీర్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 200 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేసారు. అందిన పక్కా సమాచారంతో తహసీల్దార్ రజాక్‌వలి, సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. బియ్యం డంప్ చేసిన ముల్లా నజీర్, వేణుగోపాల్, గంగాధర్, చక్రపాణిపై కేసు నమోదు చేశారు.

మహిళ అనుమానాస్పద మృతి

కళ్యాణదుర్గం: కర్ణాటకలోని వైఎస్ హొసకోట సమీపంలో జిల్లాకు చెందిన ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించారు. కర్ణాటక పోలీసుల నుంచి సమాచారం అందుకున్న కంబదూరు ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది మంగళవారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. వైఎస్ హొసకోట సమీపంలోని గుట్టలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని పరిశీలించి, కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మిగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా, ఈ ఏడాది మే 22 నుంచి వరలక్ష్మి కనిపించడం లేదంటూ అప్పట్లో ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 23న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు.

● ఈ తిప్పలు పడలేకున్నాం


బియ్యం మూటలను ఎత్తుకుని పోలేక అక్కడే ఉంచిన దృశ్యం

కూటమి పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తమైందని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ పద్ధతిని ప్రవేశపెట్టి ఇంటి వద్దకే చేపట్టిన రేషన్ పంపిణీ విధానం ఎంతో బాగుందని, ఇప్పుడు చౌకధాన్యపు డిపోల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు మానుకుని మండుటెండలో రోజంతా వేచి ఉండాల్సి వస్తుండడంతో ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని అంటున్నారు. ఈ తిప్పలు పడలేకున్నామని, ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విషయం మరోసారి ప్రభుత్వం ఆలోచించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


అతి కష్టంపై బియ్యం మూటను ఎత్తుకెళుతున్న గృహిణి


అనంతపురంలోని హమాలీ కాలనీలో మండుటెండను తాళలేక గోడ చాటుకు చేరిన రేషన్ కార్డుదారులు



సైకిల్‌పై బియ్యం మూటను తీసుకెళుతున్న దృశ్యం, చంటిబిడ్డ, బియ్యం మూటను ఎత్తుకుని వెళుతున్న మహిళ

బహిర్గతమైన 'కూటమి' విభేదాలు

- అనంతలో ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న పోలీసులు
- పల్లె రఘునాథరెడ్డి అవినీతిపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు
- పోలీసుల అండతో అడ్డుకున్న పల్లె అనుచరులు


బీజేపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో కూటమిలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. టీడీపీకి చెందిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అవినీతి అక్రమాలను బహిర్గతం చేస్తానని బీజేపీకి చెందిన ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మంగళవారం అనంతపురం నగరంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. అలాగే రుద్రంపేట సర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి బీసీలను పల్లె వంచిస్తున్న తీరుపై చర్చించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఫంక్షన్ హాల్ వద్దకు ఆయన చేరుకోగానే పెద్ద సంఖ్యలో పల్లె అనుచరులు అక్కడకు చేరుకుని భయభ్రాంతులకు గురి చేశారు. ఇరువర్గాలు బాహా బాహీకి దిగాయి. నడిరోడ్డుపైనే తోపులాట చోటు చేసుకుంది. ప్రెస్‌మీట్, రౌండ్‌టేబుల్ సమావేశం విరమించుకుని వెళ్లకపోతే దారుణమైన పరిస్థితులు చూడాల్సి ఉంటుందని పల్లె అనుచరులు హెచ్చరికలు జారీ చేశారు. ఇంతలోనే పల్లె రఘునాథరెడ్డికి మద్దతుగా అక్కడకు చేరుకున్న పోలీసులు ఎలాంటి ప్రెస్‌మీట్‌లు పెట్టడానికి వీల్లేదంటూ ఆదినారాయణయాదవ్‌ను అడ్డుకున్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పల్లె రఘునాథరెడ్డి భూమిని కబ్జా చేశారని ఆదినారాయణ యాదవ్ అనుచరులు ఆరోపించారు. అల్లరిమూకలను రెచ్చగొట్టి పదేపదే బీసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సోలార్ ప్రాజెక్ట్ కోసమని 100 ఎకరాల గిరిజనుల భూమిని ఆదినారాయణ యాదవ్ లాక్కొన్నారని పల్లె అనుచరులు ఆరోపించారు. ఇలా ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ కూటమిలోని విభేదాలను బయటపెట్టారు.

మా వాడే.. దగ్గరకు వేయండి

- మండల ఏఓ బదిలీ విషయంగా జెడ్పీ అధికారులకు డిప్యూటీ సీఎం పేషీ నుంచి ఫోన్


అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: 'అతను మా వాడే.. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఏదో ఒక మండలానికి ఏఓగా వేయండి' అంటూ జిల్లా ప్రజా పరిషత్ అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వద్ద పని చేసే ఓ అధికారి ఫోన్ చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. మొన్నటి వరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేసి ఎనిమిది నెలల క్రితం కళ్యాణదుర్గం నియోజకవర్గానికి బదిలీపై వెళ్లిన పరిపాలనాధికారి(ఏఓ) ఒకరు ఎలాగైనా జెడ్పీ లేదా చుట్టుపక్కల మండలాలకు చేరుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. మొన్నటి వరకూ జెడ్పీ అధికారులు, పాలకవర్గ పెద్దల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో కులం కార్డు బయటకు తీసి నేనూ మీ సామాజిక వర్గం వాడినేనంటూ డిప్యూటీ సీఎం పేషీలోని ఓ అధికారిని ఆశ్రయించి అతని ద్వారా జెడ్పీ అధికారులపై ఒత్తిడి పెంచారు.

విజిలెన్స్ విచారణ కొనసాగుతుండగానే..

సదరు ఏఓ జెడ్పీలో పని చేసిన సమయంలో అప్పటి ముఖ్య అధికారుల అండ చూసుకొని బరితెగించి ప్రవర్తించాడు. పాలకవర్గం అనుమతి లేకుండానే ఏకంగా రూ.3 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు చెల్లించడం అప్పట్లో దుమారం రేపింది. అందుకు ప్రతిఫలంగా భారీగానే ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జెడ్పీలోని ముఖ్య అధికారులు, సహచర ఉద్యోగుల పేర్లు కూడా వాడుకొని కాంట్రాక్టర్లతో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.

ఈ అంశంపై ప్రభుత్వానికి, లోకాయుక్తకు, విజిలెన్స్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణకు విజిలెన్స్ రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇంకా విచారణ కొనసాగుతుండగానే తాను అనుకుంటే పాలకవర్గం, జెడ్పీ ముఖ్య అధికారులు కూడా ఏమీ చేసుకోలేరని, కోరుకున్న చోటుకు పోస్టింగ్ తెచ్చుకోకపోతే తన పేరు మార్చుకుంటానంటూ సవాళ్లు విసురుతుండడం జెడ్పీలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

వారికి ఇంటి వద్దనే రేషన్ ఇవ్వండి

- కలెక్టర్ వినోద్‌కుమార్


అనంతపురంలోని కోవూరునగర్‌లో దివ్యాంగురాలికి ఇంటి వద్దనే రేషన్ అందిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయస్థితిలో ఉన్నవారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అనంతపురంలోని కొవూరునగర్ ఆరో వార్డు పరిధిలోని 65 ఏళ్ల పైడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. దివ్యాంగురాలికి సరుకులను కలెక్టర్ స్వయంగా అందజేశారు. ఇకపై 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయులు చౌక దుకాణానికి వెళ్లాల్సిన పని లేదన్నారు. వారికి ఇంటి వదద్దకే డీలర్లు సరుకులు చేరుస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, సీఎస్‌డీటీ రామకృష్ణ, డీలర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

గుత్తి: స్థానిక బీసీ కాలనీలోని ప్రభుత్వ చౌక ధాన్యపు దుకాణం, మెయిన్ బజారులో ఉన్న 8వ నంబర్ దుకాణాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. 8వ స్టోర్‌లో 46 చక్కెర ప్యాకెట్లు, 89 కిలోల బియ్యం స్టాక్‌లో నమోదు చేసిన దాని కంటే అధికంగా ఉన్నట్లుగా గుర్తించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్, ఏఓ సాయి, పీఆర్ఓ ఆదినారాయణమ్మ పాల్గొన్నారు.

'పీఎంశ్రీ'తో పాఠశాలల సమగ్రాభివృద్ధి

- సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ


మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల సమగ్రాభివృద్ధికి పీఎంశ్రీ పథకం దోహదపడుతోందని సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ అన్నారు. స్థానిక జిల్లా సైన్స్ సెంటర్‌లో మంగళవారం ఎంఈఓ-2, ఇంజినీర్లు, పీఎంశ్రీ పథకానికి ఎంపికైనా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో రాష్ట్ర పరిశీలకులు సురేష్‌కుమార్‌తో కలసి ఆమె సమావేశమై మాట్లాడారు. పీఎంశ్రీ పథకం లక్ష్యం, ఇందుకు సంబంధించి పాఠశాలల్లో విభాగాల ఏర్పాటు అంశాలను సురేష్‌కుమార్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి పీఎంశ్రీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. పథకంలో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్, క్రీడా మైదానాల ఏర్పాటు, డిజిటల్ బోధన కోసం కంప్యూటర్ ల్యాబ్, శుద్ధ నీటి కోసం ఆర్వో ప్లాంట్ తదితర సౌకర్యాల ద్వారా విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం ఏపీసీ శైలజ మాట్లాడుతూ... పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్ గ్రాంటు, ఎమ్మార్సీ గ్రాంట్, సీఆర్సీ గ్రాంట్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారులకు సూచించారు. అనంతరం పీఎంశ్రీ పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనుల స్థితి, యాప్‌లో తలెత్తే సాంకేతిక సమస్యలు... వాటి పరిష్కారం, భారత్ స్కౌట్ గైడ్స్ విభాగం ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో సమగ్రశిక్ష సూపరింటెండెంట్ మహమ్మద్ ఇక్బాల్, డీఈ జయరామ్, ఏపీఓ నారాయణస్వామి, టీసీఎస్ సాంకేతిక నిపుణుడు రాజు పాల్గొన్నారు.

'అనంత' వేదికగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

అనంతపురం కల్చరల్: రెవెన్యూ సర్వీసు అసోసియేషన్, భగవాన్ శ్రీసత్యసాయిబాబా నాటకోత్సవ సమితి సంయుక్తంగా సెప్టెంబరు 2 నుంచి 6వ తేది వరకూ అనంతపురం వేదికగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కృష్ణకళామందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ భారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యుడు మైఖేల్‌బాబు, రాజగోపాల్, నారాయణస్వామి తదితరులు వెల్లడించారు. పౌరాణిక పద్య నాటకాలు, ఏకాంక పద్య నాటకాల పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారులు విచ్చేయనున్నారు. ఉత్తమ పౌరాణిక నాటక ప్రదర్శనకు రూ.1 లక్ష, ద్వితీయ ప్రదర్శనకు రూ.70 వేలు, తృతీయ ప్రదర్శనకు రూ.40 వేలు చొప్పున నగదు పురస్కారాలను, ఏకాంకంలో వరుసగా మొదటి మూడు స్థానాలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున పురస్కారాలను అందజేయనున్నారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేస్తారు. ఉత్తమ నటి, నటుడు, ప్రతినాయకుడు, హాస్యనటుడు, సంగీతం, రంగాలంకరణ, సహాయ నటుడు విభాగాల్లోనూ ప్రోత్సాహం ఉంటుంది. గెలుపోటములతో నిమిత్తం లేకుండా పోటీలో ప్రదర్శించే ప్రతి నాటకానికి రూ.15వేలు అందిస్తారు. అర్హులైన కళాకారులు ముందుగా వివరాలతో కూడిన దరఖాస్తులను 'డి.మైఖేల్‌బాబు, కృష్ణకళామందిరం, టవర్‌క్లాక్ దగ్గర, అనంతపురం' చిరునామాకు పంపాలి. పూర్తి వివరాలకు 63006 54184లో సంప్రదించవచ్చు.

చిట్టీల పేరుతో దగా

అనంతపురం: చిట్టీల పేరుతో తమను నిలువునా మోసం చేశారని అనంతపురం త్రీ టౌన్ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. సీఐ కె.శాంతిలాల్ తెలిపిన మేరకు.. అనంతపురంలోని నాల్గో రోడ్డులో నివాసం ఉంటున్న జి.గంగరాజు భార్య జి.లక్ష్మీదేవి ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న సంఘమిత్ర నగర్‌లో నివాసం ఉంటున్న జిట్ట రామ్మోహన్ వద్ద 2021 నుంచి నెలకు రూ.25 వేలు చొప్పున రూ.5 లక్షల చిట్టీలు నాలుగు చిట్టీలు కడుతున్నారు. వీటికి సంబంధించి రూ.18.80లక్షలు చెల్లించకుండా రామ్మోహన్ తరచూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో చిట్టీల డబ్బు ఇవ్వాలని కోరిన లక్ష్మీదేవిపై రామ్మోహన్ దుర్భాషలాడుతూ అంతు చూస్తానని బెదిరించాడు. తమకు సమీప బంధువు కావడంతో చిట్టీలు కట్టి మోసపోయామని, తమకు న్యాయం చేయాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌పై కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఆర్థిక సాయం

అనంతపురం క్రైం: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల పొదుపు మరియు పరపతి సహకార సంఘం లిమిటెడ్ (ఏపీఆర్టీసీ సీసీఎస్) ద్వారా అర్హులైన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నేత రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీసీఎస్‌లో కనీసం ఐదేళ్ల సభ్యత్వం కలిగి, 63 సంవత్సరాలు వయసు నిండిన వారు అర్హులు. అనంతపురం డిపో వద్ద ఉన్న సంఘం కార్యాలయంలో ప్రతినిధులను సంప్రదించి దరఖాస్తులను పొందవచ్చు.

సేవ మాటున దోపిడీ

- సర్వజనాస్పత్రిలో ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకుల దందా
- ప్రతి నెలా రూ.15 లక్షలకుపైగా అక్రమార్జన




ఫిల్మ్ కోసమని రోగి నుంచి రూ.1,500 వసూలు చేసిన బిల్లు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సేవ పేరుతో ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకులు దందాకు తెరలేపారు. సిటీ స్కాన్ ఫిల్మ్‌ల పేరుతో రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు. అవసరం లేకున్నా.. రోగులకు మూడు ఫిల్మ్‌లు అంటగడుతూ ప్రతి నెలా రూ.లక్షల్లో అక్రమంగా కూడబెట్టుకుంటున్నారు.

ప్రతి నెలా రూ.20 లక్షలు చెల్లిస్తున్న ప్రభుత్వం

సర్వజనాస్పత్రిలో సీటీ స్కానింగ్ బాధ్యతలను 2014 నుంచే ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకులు తీసుకున్నారు. ఇందు కోసం ఒక్కో సీటీ స్కాన్‌కు రూ.799 చొప్పున ప్రతి నెలా రూ.20 లక్షల వరకూ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అప్పటి నుంచి ఒకే స్కానింగ్ మిషన్‌ను ఉపయోగిస్తూ వస్తుండడాన్ని గత ఏడాది ఎన్ఎంసీ సభ్యులు గుర్తించి అక్కడ పని చేస్తున్న రేడియాలజిస్ట్, టెక్నీషియన్‌ను మందలించారు. వెంటనే కొత్త మిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతేకాక రోగులకు అందించే సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని నిర్వాహకులు అదే రోగుల ముక్కుపిండి రూ.లక్షల్లో సొమ్ము చేసుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

ప్రతి నెలా ఫిల్మ్‌ల ద్వారా రూ.15 లక్షలకు పైగా వసూలు

ఒకప్పుడు స్కానింగ్‌కు సంబంధించి ఫిల్మ్‌ను తీసుకెళ్లి వైద్యులకు చూపి చికిత్స పొందేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న వైద్యులు స్కానింగ్ రిపోర్టులను పరిశీలించి చికిత్స అందజేస్తున్నారు. అయినా కొందరు భౌతికంగా స్కానింగ్ ఫిల్మ్‌లు కావాలని కోరుకుని తీసుకుంటున్నారు. ఇదే ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకులకు వరమైంది. సర్వజనాస్పత్రిలో రోజూ 80 వరకు సీటీ స్కాన్‌లను నిర్వహిస్తుంటారు. ఇందులో కనీసం 50 మంది భౌతికంగా ఫిల్మ్‌లను తీసుకెళుతుంటారు. రోగి చేయించుకునే స్కానింగ్‌ను బట్టి ధర నిర్ణయించి బలవంతంగా ఫిల్మ్‌లు అంటగడుతున్నారు. వైద్యుడి పరిశీలన నిమిత్తం ఒక్క ఫిల్మ్ ఉంటే సరిపోతుంది. అయితే నాలుగైదు ఫిల్మ్‌లు తీసుకోవాల్సిందేనంటూ బలవంతంగా అంటగడుతుండడంతో రోగులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఇటీవల ఓ రోగి అబ్డామిన్‌కు సంబంధించి సీటీ స్కాన్ చేయించున్నారు. ఇందుకు సంబంధించి ఫిల్మ్ కావాలని అడిగితే ఏకంగా ఐదు ఫిల్మ్‌లు అంటగట్టి రూ.1,500 బిల్లు వేశారు. వాస్తవానికి ఒక్కో ఫిల్మ్ ధర రూ.వందకు మించి ఉండదు. రోగుల బలహీనతను ఆసరాగా చేసుకున్న ఎస్ఎల్ డయాగ్నస్టిక్ నిర్వాహకులు ఒక్కో ఫిల్మ్‌కు రూ.300, అంతకు పైగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన సీటీ స్కాన్ నిర్వాహకులు కేవలం ఫిల్మ్ ద్వారానే ప్రతి నెలా రూ.15 లక్షలపైగా అక్రమ ఆదాయాన్ని కూడబెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

నగదు చెల్లింపులు మాత్రమే

తమ అడ్డగోలు బాగోతం బయటపడకుండా ఉండేందుకు ఎస్ఎల్ డయాగ్నిస్టిక్ నిర్వాహకులు నగదు లావాదేవీలు మాత్రమే కొనసాగిస్తున్నారు. ఎలాంటి యూపీఐ, ఆన్‌లైన్ లావాదేవీలను అంగీకరించరు. ఈ మొత్తం వ్యవహారంలో కేవలం బిల్లు మాత్రమే కనిపిస్తుంటుంది. యూపీఐ, ఆన్‌లైన్ చెల్లింపులైతే తమ దందా బయటపడుతుందనే భావన నిర్వాహకుల్లో వ్యక్తమవుతోంది. దీంతో నగదు చెల్లింపుల విషయం రికార్డులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన యువకుడు దస్తగిరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. ఓ మైనర్ బాలికను లైంగికంగా వేధిస్తుండడంతో బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

అనంతపురం సెంట్రల్: నగరంలోని ఐసీడీఎస్ బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఓ బాలిక విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అధికారులు తెలిపిన మేరకు... నార్పలకు చెందిన ఓ బాలిక బాల్య వివాహం చేసుకోవడంతో ఐసీడీఎస్ అధికారులు స్పందించి బాలసదనానికి తీసుకువచ్చారు. అయితే ఇక్కడ ఉండేందుకు ఇష్టపడని సదరు బాలిక మంగళవారం విషద్రావకం తాగింది. గమనించిన సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సనందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం కుదురుగా ఉందని అధికారులు తెలిపారు.

చెరకు పంట దగ్ధం

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో మంగళవారం చెలరేగిన మంటల్లో చెరకు పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన శాంతరాజు మరో రైతుకు చెందిన 7 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని ఎకరాకు రూ.12 వేలు చొప్పున చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం చెరకు పంట సాగు చేపట్టాడు. మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు పడి మంటలు రాజుకున్నాయి. చూస్తుండగానే చెరకు తోటను మంటలు చుట్టుముట్టడంతో డ్రిప్ పరికరాలు, పైపులు, స్ప్రింకర్లు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసేలోపు రూ.10 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధిత కౌలు రైతు వాపోయాడు.

● జాలి లేని నీలి మేఘం


ఆకాశంలో తేలిపోతున్న మేఘాలు

నైరుతి ప్రభావం కారణంగా ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా.. ఉమ్మడి అనంత జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రోజూ ఊరిస్తున్న మేఘాలు... కాసేపటికే తేలిపోతున్నాయి. ఇప్పటికే పొలాలను దుక్కి చేసి విత్తుకు రైతులు సిద్ధం చేశారు. అయినా వరుణుడు కరుణించకపోవడంతో ఆకాశంలో మబ్బుల వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:

క్లుప్తంగా

దోబీఘాట్లు ఏర్పాటు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: సదుపాయాలతో కూడిన దోబీఘాట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా కార్యదర్శి హరికృష్ణ మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. కొన్ని చోట్ల దోబీఘాట్లు ఉన్నా నీటి సౌకర్యం లేదన్నారు. బుక్కరాయసముద్రం మండలం చాకలి ఐలమ్మ కాలనీ, గార్లదిన్నె మండలం కల్లూరు, పామిడి, యాడికి, పెద్దవడుగూరు, యాడికి మండలం పుప్పాల, శింగనమల మండలం సోదనపల్లిలో దోబీఘాట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్: జిల్లా శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో తపోవనంలోని శ్రీక్షేత్రం దశమ బ్రహ్మోవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్నాయి. జిల్లాలోనే అరుదైన లక్ష్మీ హయగ్రీవ వేంకటేశ్వర, గోదా రంగనాథస్వామి ఆలయంలో ఏటా సంప్రదాయసిద్ధంగా సాగే బ్రహ్మోత్సల్లో భాగంగా తొలిరోజు ధ్వజారోహణం, దివ్యప్రబంధ పారాయణం, నవకలశ స్నపనం, సుదర్శన హోమం, దీపోత్సవం, గురువారం శ్రీవారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, నగరోత్సవాలు, శుక్రవారం ధ్వజ అవరోహణం, వసంతోత్సవం, నిరాటోత్సవంతో పాటూ ద్వాదశ కలశారాధన జరుగుతాయని ఆలయ నిర్వాహకులు మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ముమ్మరంగా బాల కార్మికుల గుర్తింపు ప్రక్రియ


ఓ షాపులో పని చేస్తున్న బాల కార్మికుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా బాల కార్మికుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కార్మిక, ఐసీడీఎస్, ఐసీపీఎస్, పోలీస్, ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్, రాంనగర్, నీరు–ప్రగతి పార్క్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. హోటళ్లు, టీ కొట్లు, మెకానిక్ షెడ్లు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థల్లో బాల కార్మికులు ఏమైనా పని చేస్తున్నారా అని ఆరా తీశారు. ఇద్దరు బాల కార్మికులను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ అధికారిణి సుజాత, ఐసీడీఎస్ కౌన్సెలర్ జే.సంధ్య, విద్యాశాఖ అధికారి వెంకటేశ్, ఎన్జీఓ కో–ఆర్డినేటర్ అనిత, పోలీసులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

రాప్తాడు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సత్వరమే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రాప్తాడులో సీపీఐ మండల మహాసభను మండల కార్యదర్శి చలపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం కల్పించిన పాపాన పోలేదన్నారు. రైతును రాజును చేస్తామన్న ప్రభుత్వాలు నేడు రైతులను జీరో చేశాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద సంత్సరానికి రూ.20 వేలు రైతుల ఖాతాలోకి జమ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు.నాయకులు నాగరాజు, రఫీ, సంజీవులు, నల్లప్ప, టోపి సాబ్ పాల్గొన్నారు.

రేపు వన మహోత్సవం

అనంతపురం సెంట్రల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పంపనూరు నగరవనంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి శ్యామల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాదిలో 3.85 లక్షల మొక్కల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా ఉందని తెలిపారు. జిల్లాలో 14 ఫారెస్ట్ నర్సరీల్లో 12.25 లక్షల మొక్కలు పంపిణీ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ బాబు

- నేడు రాప్తాడుకు తరలిరండి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడు: ఎన్నికల హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామ ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీ, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకుని ఆయనకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం అయిన సందర్భాన్ని పురస్కరించుకుని వెన్నుపోటు దినంగా పరిగణిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే రూ.3 వేలు భృతి చెల్లిస్తామని బాబు చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందించడం ద్వారా రైతులను ఆదుకుంటామని ఇచ్చిన హామీ ఎక్కడికి పోయిందన్నారు. పంటలకు గిట్టుబాటు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకునే వారు ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇంత వరకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు.


మాట తప్పిన బాబు..

స్త్రీ శక్తి కింద 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు రూ.15 వేలు ఇస్తామని మాట తప్పారని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని చెప్పి కొందరికి మాత్రమే ఒక్క గ్యాస్ సిలిండర్ ఇచ్చారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇంత వరకు అమలు చేయలేదన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వక పోవడం వల్ల చాలా మంది పేద విద్యార్థులు మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి దీవెన పూర్తిగా రద్దు చేయడం అన్యాయమన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పింఛన్ ఇస్తామన్న హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏ బకాయిలు, పీఆర్సీ, ఇంటీరియం రిలీఫ్ ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల ఆరియర్స్ ఇవ్వాల్సిందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ సరఫరా చేశారని తెలిపారు. కానీ చంద్రబాబు రేషన్ డోర్ డెలివరీ రద్దు చేసి పాత పద్ధతిని పునరద్దరించడం వల్ల పేదలు, మహిళలు రాత్రి 9 గంటల సమయంలో కూడా ఎఫ్‌పీ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 90 శాతానికి పైగా అమలు చేశారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయపెట్టేందుకు యత్నిస్తోందన్నారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు రాప్తాడులో నాలుగు రోడ్ల కూడలిలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, అక్కడి నుంచి ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం మీదుగా రాప్తాడు బస్టాండు సర్కిల్‌కు చేరుకుని అక్కడా మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలుపుతామన్నారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, ప్రజలు ఉదయం 9 గంటలకే రాప్తాడుకు పెద్ద ఎత్తున చేరుకోవాలని కోరారు.

వెన్నుపోటు బాబు నైజం

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: బిడ్డనిచ్చిన మామ ఎన్టీఆర్ నుంచి ప్రజల వరకు మోసం చేయడమే సీఎం చంద్రబాబుకు తెలుసని, వెన్నుపోటు బాబు నైజమని మేయర్ వసీం విమర్శించారు. మంగళవారం డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లతో కలసి మేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా..ఇంత వరకు ఒక్క హామీను నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించినా ఇంత వరకు ఆ ఊసేలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగనన్న ప్రజలు అన్ని విధాల అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటే కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా వైఎస్సార్ సీపీ అధిష్టానం వెన్నుపోటు దినం పేరిట చేపడుతున్న నిరసన ర్యాలీను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దగాకోరని ధ్వజమెత్తారు. మహిళా సాధికారత దేవుడికెరుకని, తల్లికి వందనం, మహిళలకు డబ్బు ఇస్తామని మోసం చేశారన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో సీఎం చంద్రబాబుకు తప్పక బుద్ధి చెబుతారన్నారు. కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, కమల్ భూషణ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మధు, నాయకులు కుళ్లాయస్వామి, దాదు, కాకర్ల శీన తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ వసీం

చంద్రబాబు మోసాలను ఎండగట్టాలి


పోస్టర్ విడుదల చేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా..ఇంత వరకు ఒక్క హామీ అమలు చేయలేదని, వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ద్వారా సీఎం చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా 1,25,000 మందికి, రెండున్నర లక్షల మంది వలంటీర్లకు, వైద్య ఆరోగ్యశాఖలో 50 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దారన్నారు. పేదలపై ఆర్థిక భారం పడకుండా అమ్మఒడి, విద్యా, వసతి దీవెన అందించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే అధికంగా పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, జనసేన పవన్ కళ్యాణ్ ప్రగల్భాలు పలికారన్నారు. ఏడాది గడుస్తున్నా ఒక్క హామీను అమలు చేయలేదన్నారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నిరుద్యోగ యువతను నట్టేట ముంచారన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధులు మారుతీనాయుడు, లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్ కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు బుద్ధి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

‘వారి ఆగడాలు భరించలేకున్నాం’


దివ్యాంగుల చట్టం–2016 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాప్తాడురూరల్: ఉప్పరపల్లి పంచాయతీలోని సంత్ రవిదాస్‌కాలనీలో దివ్యాంగులపై మలోబులేసు, ఉషారాణి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డీఎస్పీ వెంకటేశ్వర్లును కోరారు. మంగళవారం వారు డీఎస్పీని కలిసి సమస్యను వివరించారు. అనంతపురం రూరల్ పరిధిలో చాలాచోట్ల దివ్యాంగుల పట్ల దౌర్జన్యాలు, దూషణలు ఎక్కువవుతున్నాయని వాపోయారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 లోని 92(ఎ) సెక్షన్ మేరకు నిందితులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క వికలాంగునికి కూడా అన్యాయం జరగకుండా చూస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. సంత్ గురుదాస్ కాలనీ వ్యవహారంపై విచారణ జరిపిస్తామన్నారు. అనంతరం దివ్యాంగుల హక్కుల చట్టం–2016 (తెలుగు అనువాదం) పుస్తకాన్ని డీఎస్పీ, ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. డీఎస్పీని కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, న్యాయ సలహాదారు జెన్నే ఆనంద్, గౌరవ సలహాదారు ముత్యాలప్ప, జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్, కార్యదర్శి రాజేష్, దొనస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు లక్ష్మన్న పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

అనంతపురం: నగరంలోని జానకీరాం నగర్‌కు చెందిన పఠాన్ రసూల్ ఖాన్ కుమారుడు పఠాన్ సుబహాన్ ఖాన్ అదృశ్యమయ్యాడు. కొన్ని రోజుల క్రితం కుటుంబ సభ్యులకు, బంధువులకు ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. అతని మొబైల్ నెంబర్ సైతం స్విచ్ఛాఫ్ వస్తోంది. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపారు. రసూల్ ఖాన్ సెల్‌ఫోన్‌కు సంబంధించి కాల్ డిటైల్డ్ రికార్డును (సీడీఆర్) పరిశీలించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరినట్లు పేర్కొన్నారు.

హరితకు నాట్యసారథి అవార్డు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన అరవింద నృత్య శిక్షణాలయం గురువులు సురేష్ మాస్టర్ శిష్యురాలు చిన్నారి హరిత నాట్యసారథి అవార్డునందుకుంది. బెంగళూరులోని కళా క్షేత్ర ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల వారి నాట్య ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్వాహకులు నిర్మల జ్యోతి, సిని నిర్మాత ప్రవీణ్ కులకర్ణి, నటుడు యోగేష్ చేతుల మీదుగా అవార్డుతో పాటు సత్కారమందుకుంది. ఈ సందర్భంగా వారు అనంత కళాకారుల ప్రతిభాపాటవాలను ప్రస్తుతించారు.

ఈడిగ ఉద్యోగుల సంఘం సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఈడిగ ఉద్యోగులు, ఈడిగ సంఘం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈడిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో చేపట్టబోయే కులగణనలో రాష్ట్రంలోని ఈడిగ కులస్తులు వేర్వేరుగా గణన చేయాలని కోరారు. అందరినీ కలిపి గణన చేస్తే వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న ఈడిగ కులస్తులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన కులస్తులకు వేర్వేరుగా నంబర్లు కేటాయించి గణన చేసేలా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేలా తీర్మానించారు. ఈడిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ, జిల్లా ఉద్యోగులసంఘం వ్యవస్థాపక ఉపాధ్యక్షులు టీచర్ నారాయణస్వామి, వేణుగోపాల్, ఈడిగ సంఘం నాయకులు సూరిబాబు, నాగరాజు చంద్రశేఖర్, అమర్నాథ్, రఘునాథ్, ఆదినారాయణ, గోపాల్, మధుసూదన్, వెంకట కేశవులు, విజయ్ కుమార్, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

గార్లదిన్నె: గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ వెంకటేశులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, పాత కేసులపై ఆరా తీశారు. శాంతిభద్రలకు విఘాతం కలుగకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

నిమ్మ చెట్ల నరికివేత


కొట్టేసిన నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

యాడికి: మండలంలోని కత్తిమానుపల్లిలో రైతు శివరామి రెడ్డి పొలంలో గుర్తు తెలియని దుండగులు మంగళవారం తెల్లవారుజామున 14 నిమ్మ చెట్లు నరకడమే కాకుండా డ్రిప్ పైపులను తగలబెట్టారు. దీంతో రూ.50 వేల వరకూ నష్టం వచ్చిందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్‌ఐ వెంకటరమణ తన సిబ్బందితో కత్తిమానుపల్లికి వెళ్లి పొలాన్ని పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ

శింగనమల: రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంభించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని సోదనపల్లి, శింగనమల గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణనిచ్చారు. ఆమె మాట్లాడుతూ పంటలసాగు విధానంలో రైతులు నూతన మెలకువలు , పద్ధతులను పాటించాన్నారు. రైతులకు వేరుశనగ విత్తన పంపిణీ , ఎరువుల సరఫరా, రైతు విశిష్ట సంఖ్య నమోదు, భూసార పరీక్షలు గురించి వివరించారు. వేరుశనగలో ట్రైకోడెర్మ జీవన ఎరువుతో విత్తనశుద్ధి, వాటి ఉపయోగాల గురించి తెలిపారు. తెగుళ్ల, పురుగుల వల్ల నష్టం, వాటిని ఎలా నివారించాలో వివరించారు. కేవీకే కోఆర్డినేటర్ మల్లీశ్వరి మాట్లాడుతూ వరి సాగులో మెలకువలు, వరిలో రకాలు, కాలిబాటలు, కలుపుమందులు పిచికారి, భూసార పరీక్షలు వాటి ఉపయోగాలపై రైతులకు వివరించారు. మాట్లాడుతూ కార్యక్రమంలో రెడ్డిపల్లి ప్రిన్సిపల్ శాస్త్రవేత్త భార్గవి, రేకుల కుంట ఎఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త రాజన్న, శశికళ, రఘ కిరణ్, మండల వ్యవసాయాధికారి అన్వేష కుమార్, పశువైద్యాధికారి కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి


కిశోరబాలికలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాప్తాడురూరల్: బాలికలు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని ఐసీడీఎస్ అనంతపురం రూరల్ సీడీపీఓ ధనలక్ష్మీ సూచించారు. మంగళవారం అనంతపురం రూరల్ 5–సెక్టార్ పరిధిలోని ముత్యాలమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికల సాధికారత–నాయకత్వంపై శిక్షణ ఇచ్చారు. నాయకత్వం అంటే పదవి కాదని బాధ్యతతో పని చేయడం అన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ జయశ్రీ, మహిళా సంరక్షణ కార్యదర్శి లిఖిత, వర్కర్లు రమణమ్మ, గంగాదేవి, షాను, హెల్పర్ శారద పాల్గొన్నారు.

అవగాహనతోనే కిశోరి వికాసం

అనంతపురం సెంట్రల్: యుక్త వయస్సు పిల్లలు శరీరంలో వచ్చే మార్పులు, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ లలిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలో హైదర్‌వలీకాలనీ, రాణీనగర్ తదితర కాలనీల్లో కిశోరి వికాసం చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు వరలక్ష్మి, ఆరిఫా, జయలక్ష్మి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

బొమ్మనహాళ్: చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట, ఉంతకల్లు, దర్గాహొన్నూరు తదితర గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ నాగరాజు నాయుడు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పూర్తిగా చెత్త సేకరణ లక్ష్యంగా పని చేయాలన్నారు. గ్రామస్తులు రోజూ సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తను వేర్వేరుగా చెత్త సేకరించే సిబ్బందికి అందించాలన్నారు. ఎంపీడీఓ దాస్, సర్పంచులు ముక్కన్న, శంకుతలమ్మ, పంచాయతీ కార్యదర్శి శివన్న, పల్లవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

వజ్రకరూరు: రాగులపాడు గ్రామ పరిసర ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గుంతకల్లు మండలం ములకలపెంటకు చెందిన ప్రసన్నకుమార్ ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్లి తిరిగి గుంతకల్లుకు వెళ్తుండగా మార్గంమధ్యలో రాగులపాడు వద్ద జింక అడ్డం రావడంతో కిందకు పడ్డాడు. ఈప్రమాదంలో ప్రసన్నకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని 104 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కర్నూలుకు తరలించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించండి


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంఘం ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. చాలా మంది పాత్రికేయులు జీతభత్యాలు లేకుండానే పని చేస్తున్నారన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అవకాశం కల్పిస్తూ ప్రత్యేకంగా సర్క్యులర్ ఉందన్నారు. అయితే కొన్నేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ ఏడాది నుంచి జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందేలా చూడాలని కోరారు. సమస్యపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వర్కింగ్ జర్నలిస్టులు తమ పిల్లలు ఏ పాఠశాలలో చదువుతున్నారు వివరాలతో దరఖాస్తును డీపీఆర్‌ఓ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. పాత్రికేయులు సీపీ వేణుగోపాల్, నాగేష్, సూర్యజయప్రకాశ్, విజయ కుమార్, సుధాకర్, తిమ్మప్ప, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎస్సీ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: హిందీ సేవా సదన్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక యాప్ ద్వారా డీఎస్సీ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే గతంలోనే ఒకసారి ఈ మోడల్ పరీక్ష నిర్వహించామని, అభ్యర్థుల విన్నపం మేరకు రెండోసారి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ హిందీ, టీజీటీ హిందీ, పీజీటీ హిందీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 95813 86150, 95536 77116, 98487 83787 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సీఐటీయూ కమిటీ ఎన్నిక

అనంతపురం అర్బన్: సీఐటీయూ నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నగర 11వ మహాసభలను మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. మహాసభలకు ముఖ్యఅతిథులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకుడు రామిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం సీఐటీయూ నగర కమిటీ అధ్యక్షుడిగా వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ముత్తుజ, కోశాధికారిగా ఎన్టీఆర్ శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఆఫీసు బేరర్లుగా రామిరెడ్డి, గోపాల్, తిరుమలేశు, ఎర్రిస్వామి, నాగరాజు, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, లతీఫ్, ఆజామ్, ఆదినారాయణ, కిష్ట, చంద్ర, కమిటీ సభ్యులుగా సులేమాన్, అక్బర్, శివారెడ్డి, ఆదినారాయణ, సురేంద్ర, కుమార్, ప్రసాద్, రాజు, నరసింహులు, రామాంజనేయులు, స్వాతి ఎన్నికయ్యారు.

తల్లిపాలు అమృతంతో సమానం


మాట్లాడుతున్న ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆర్ఎంఓ హేమలత

రాప్తాడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లి పాలు తాపించాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆర్ఎంఓ హేమలత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, తల్లి బిడ్డకు అనుబంధాన్ని తల్లి పాలు పెంచుతుందన్నారు. తల్లి పాలలో సహజసిద్ధమైన ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయన్నారు. తల్లిపాలు తాగే పిల్లలు బలంగా ఉంటారని, వ్యాధి నిరోధక శక్తి, తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, చేపలు, పాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శివ కృష్ణ, సీహెచ్‌ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్లు హేమలత, నరసింహ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.